క్లుప్తంగా

జూన్ 5న గిరిజన సంఘం జిల్లా సదస్సు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో జూన్ 5వ తేదీన గిరిజన సంఘం జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు మండంగి రమణ, సంఘ జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు కోలక అవినాష్ తెలిపారు. ఇదే విషయమై మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడిన వారు ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు మాజీ పార్లమెంట్ సభ్యులు మిడియం బాబూరావు హాజరవుతారని, బోయవాల్మీకి, జీవో నంబర్–3, భాషా వలంటీర్లు, సీఆర్‌టీలు, గిరిజనుల రిజర్వేషన్లు తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. గిరిజనులంతా ఈ సదస్సుకు హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

భామిని: మండలంలోని ఘనసర గ్రామంలో కొత్తగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో కుంకుమ పూజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు గుడిమెట్ల భాస్కరశర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో చాలామంది దంపతులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కిల్లారి కమల, వైఎస్సార్ సీపీ నేత ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు



పరీక్షలు రాసి, బయటకు వస్తున్న విద్యార్థులు

బాడంగి: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 24వ తేదీన ప్రారంభమైన పరీక్షలు ఆరు రోజుల పాటు రెండు పూటలా జరిగాయని పరీక్ష కేంద్రం చీఫ్ వి.శంకరరావు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా జరిగాయని, మాస్ కాపీయింగ్ జరగలేదని, ఇంతవరకు ఏ ఒక్కరూ డిబార్ కాలేదని తెలిపారు.

వీధికుక్కల దాడిలో దివ్యాంగునికి గాయాలు

రేగిడి: మండలంలోని మీసాలడోలపేట గ్రామంలో పాలకొండ సురేష్ అనే దివ్యాంగునిపై మంగళవారం వీధికుక్కలు దాడిచేసి గాయపర్చాయి. సురేష్‌కు రెండు చేతులు లేకపోవడంతో వీధికుక్కలు మీదపడి దాడి చేసినా ప్రతిఘటించలేకపోయాడు. స్థానికులు గమనించి కుక్కలను బెదరగొట్టి, 108కు సమాచారం అందించారు. ఈఎంటీ మీసాల ఈశ్వరరావు, పైలెట్ గర్భాపు నారాయణరావు గాయాలపాలైన సురేష్‌కు ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారిణి దీక్షితారాణి

తెర్లాం: పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి దీక్షితారాణి సూచించారు. మండలంలోని రాజయ్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు, చిన్నారులు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, ఎండలో ఎవరూ తిరగవద్దని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్‌ఎం వెంకటి పాల్గొన్నారు.

రైతు భరోసా నిధుల విడుదల రేపు

బొబ్బిలి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో రైతు భరోసా పథకం నిధుల విడుదల కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందరరావు మంగళవారం తెలిపారు. ఏటా ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5,500, కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 30వ తేదీన జరగాల్సిన ఈ కార్యక్రమం 1వ తేదీకి వాయిదా పడిందని, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారని పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ/వీరఘట్టం: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి, నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు మండల కేంద్రంలో మంగళవారం కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాలుగేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వివరించారు. తనకు ఓటు వేసినా, ఓటు వేయకపోయినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరినీ తనవారిగానే భావిస్తారని, అన్ని వర్గాల బాగోగుల కోసం ఆయన అహర్నిశలు పాటుపడుతున్నారని ప్రశంసించారు. ఓ పార్టీ పెట్టి, దానిని అధికారంలోకి తీసుకురావడం అంత సులభమేమీ కాదన్నారు. ఆయన పార్టీ పెట్టిన నాటి నుంచి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారన్నారు. ప్రజలకు మేలు చేయాలన్నదే ఆయన తపన అని, వారి మంచి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. 2014లో అధికారంలో ఉన్న టీడీపీ 650 హామీలను ప్రజలకు ఇచ్చిందని, అయితే వాటిలో 10 శాతం కూడా నెరవేర్చలేదని విమర్శించారు. అప్పుడు ఇచ్చిన అరకొర పథకాలు కూడా తమ పార్టీ వారికే ఇచ్చేవారన్నారు. అభివృద్ధి చేయకుండా గ్రాఫిక్స్ చేసి, చూపించారని దుయ్యబట్టారు. ఇప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తోందన్నారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. పథకాల పంపిణీలో దళారీ వ్యవస్థను రూపుమాపడం జరిగిందన్నారు. లబ్ధిదారుల ఖాతాల్లోనే నేరుగా పథకాల నగదు జమ అవుతోందన్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. ఈ ప్రాంత చిరకాల వాంఛ అయిన తోటపల్లి కుడి, ఎడమ కాలువల ఆధునీకరణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. అలాగే రూ.24.5 కోట్ల వ్యయంతో కిమ్మి–రుషింగి వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. త్వరలోనే ఈ వంతెనను కూడా సీఎం జగనన్న చేతులమీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమం చేసి చూపిస్తున్న వైఎస్సార్ సీపీకే ప్రజామద్దతు అని, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం ఖాయమన్నారు.

టీడీపీ సొంత మేనిఫెస్టో ఉందా?

టీడీపీకి సొంత మేనిఫెస్టో ఉందా అని ప్రశ్నించారు. ఇక్కడి వైఎస్సార్ సీపీ, మొన్న కర్ణాటకలో జరిగిన ఎన్నికల కోసం అక్కడి కాంగ్రెస్, బీజేపీ రూపొందించిన మేనిఫెస్టోలోని అంశాలను టీడీపీ కాపీ కొట్టి, మహానాడులో విడుదల చేసిందని విమర్శించారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదనే జనం అధికారం నుంచి దించేసింది నిజం కాదా అన్నారు. టీడీపీ అబద్ధపు హామీలను మరోసారి నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. రాజమహేంద్రవరంలో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసింది మహానాడు కాదని, అదొక మాయనాడు అని ఎద్దేవా చేశారు. పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇస్తుంటే వాటిని కూడా సమాధులతో పోల్చిన టీడీపీ అధినేత చంద్రబాబుకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి శాశ్వత సమాధి కడతారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించడం ఖాయమన్నారు. అంతకుముందు పాలకొండ–వీరఘట్టం రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కలిసి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. దీంతో పాటు స్థానిక ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగరపంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేసిన పార్టీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దంపతులు

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

కురుపాం: ప్రజలకు మేలు చేసిన, చేస్తున్న పార్టీ ఏదైనా ఉందంటే అది ఒక్క వైఎస్సార్ సీపీయేనని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి, నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు మంగళవారం కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేసి, ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు పార్టీ సాధించిన విజయాలు, ఈ నాలుగేళ్లలో చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలను వారు వివరించారు. గత పాలకుల కన్నా భిన్నంగా ప్రజలంతా మెచ్చేలా పాలనను అందించాలన్న సదుద్దేశ్యంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పెట్టి, నడుపుతున్నారన్నారు. ఆయన తన పాదయాత్ర మొదలుకుని, ప్రజా సంకల్పయాత్ర వరకు విన్న ప్రతీ ప్రజాసమస్యను ఆయన తీర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. నాలుగేళ్ల పాలనలోనే తనదైన మార్క్ చూపించి, దేశంలోనే ఉత్తమ ముఖ్యమంత్రిగా పేరు గడించారన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థతో అర్హులకు పారదర్శకంగా పథకాలు అందేలా చూస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగేలా ఆయన రూపొందించి, అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. టీడీపీ హయాంలో ఏదైనా పథకం పొందాలంటే టీడీపీకి ఓటేసిన వారై ఉండాలన్నారు. ఇప్పుడు అలా కాదన్నారు. తన పార్టీకి ఓటేశారా, లేదా అని చూడకుండా జగనన్న పథకాలు అందిస్తున్నారని, ఇదే ఆయనకు ప్రజల సంక్షేమం పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. ఇటీవల టీడీపీ మహానాడులో విడుదల చేసిన మేనిఫెస్టో అంతా కాపీ, పేస్ట్ అని ఎద్దేవా చేశారు. కర్ణాటకలోని కాంగ్రెస్, బీజేపీలు ప్రకటించిన హామీలతో పాటు ఇక్కడి వైఎస్సార్ సీపీ అమలు చేస్తున్న పథకాలను పేర్లు మార్చి, మేనిఫెస్టోలో పొందుపరిచారని విమర్శించారు. అబద్ధపు హామీలతో మరోసారి చంద్రబాబు ప్రజలను మోసగించేందుకు సిద్ధమయ్యారని, అయితే దానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. జనమంతా జగనన్న వైపే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయభేరి మోగించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కురుపాం, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం ఎంపీపీలు ఎస్.పద్మావతి, ఎస్.శ్యామల, కె.దీనమయ్య, కురుపాం జెడ్పీటీసీ జి.సుజాత, డీసీసీబీ డైరెక్టర్ ఎల్.నారాయణరావు, కళింగ వైశ్య, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్లు కె.సురేష్, జి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి రెండోరోజు పూజలు



శిలా విగ్రహానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు విశ్వేశ్వరరావు, రామకృష్ణ

సీతానగరం: మండలకేంద్రంలోని రాష్ట్ర రహదారిపై గల అభయాంజనేస్వామి ఆలయంలో రెండవ రోజు స్వామివారికి ఆలయ నిర్వాహక సభ్యులు కె.లక్ష్మణరావు, శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో హోమ, యాగ పూజలను ఎం.వి నాగరాజు శర్మ మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు ఆలయ అర్చకుడు నాగరాజు శర్మ మాట్లాడుతూ స్వామివారి శిలా విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా లోకకల్యాణార్థం సుందరకాండ పారాయణం, త్రిచ, అరుణ, సౌరపారాయణ, సూర్య నమస్కారాలు, హోమం, క్షీరాది వాసం, ధాన్యాది వాసం, మహాలింగార్చన సహిత రుద్రాభికం, పుష్పాదివాసం కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. బుధవారం పూర్ణాహుతి, అన్నసంతర్పణ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

వెల్‌నెస్ కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలందించాలి

- డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు



మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు

సీతానగరం: ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తెచ్చిన వెల్‌నెస్ కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చూడాలని డీఐఓ డాక్టర్ టి జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం మరిపివలస, జోగింపేట, పెదభోగిలి వెల్‌నెస్ కేంద్రాలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్‌నెస్ కేంద్రాలలో రోజువారీ రోగుల ఆరోగ్య వివరాలను, ఓపీ రికార్డులను, గర్భిణుల వివరాల నమోదు, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం రికార్డులు, వైద్య పరికరాలు, మందుల నిల్వలు, వైద్యపరీక్షల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జ్వర లక్షణాలతో కేంద్రానికి వచ్చిన వారికి తక్షణమే నిర్ధారణ పరీక్షలు నిర్వహించి పర్యవేక్షణ చేయాలన్నారు. అక్కడ అందజేస్తున్న వైద్య సేవల వివరాలను పోస్టరులో ప్రదర్శించాలని సూచించారు. వైద్య పరికరాలను పరిశీలించి ఆయా సందర్భంలో వినియోగించాలని చెప్పారు. అనంతరం టెలిహబ్ ద్వారా అందజేస్తున్న సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సీహెచ్‌ఓలు శ్రావణి, లావణ్య,సునీత, ఏఎన్‌ఎంలు గౌరి, చైతన్య,సిబ్బంది దుర్గా ప్రసాద్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రతీ పేదవానికి ఆర్థిక చేయూత

- ఎమ్మెల్యే కంబాల జోగులు



ఆదర్శనగర్‌లో సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: ప్రతీ పేదవానికి ఈ ప్రభుత్వం హయంలో సంక్షేమ పథకాలు అందాయని, ప్రతీ పేద కుటుంబం ఆర్థికంగా బలోపేతం అయిందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ఈ నాలుగేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం టీడీపీ ప్రభుత్వంలో ఎన్నడూ జరగలేదన్నారు. పట్టణంలోని ఆదర్శనగర్, అమ్మవారికాలనీలో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారన్నారు. నవరత్న పథకాలతో ప్రతీ కుటుంబం ఆనందంగా జీవిస్తోందన్నారు. ఎన్నికలు సమీపించడంతో టీడీపీ నేతలు కల్లబొల్లి కబుర్లతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, టీడీపీ పొరపాటున అధికారంలోకి వస్తే ఈ పథకాలన్నీ కనుమరుగవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వంజరాపు విజయ్‌కుమార్, వెంపల లక్ష్మణరావు, జేసీబీ శ్రీను, ఆర్నిపల్లి వెంకటనాయుడు, ఓలేటి గణపతి, రేజేటి జయరాం, చప్పటి పెంటయ్య, శ్రీహరినాయుడు, ఎస్.నాగేశ్వరరావు, సతీష్, చిన్న, సోరాడ సూరి, పట్టుశాలి కార్పొరేషన్ డైరెక్టర్ బొల్లా లలితకుమారి, మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజు, ఏఈ రత్నాకర్, సూపర్‌వైజర్ శ్రీధర్, వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

భామిని: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని జగనన్న కాలనీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు మండల హౌసింగ్ ఏఈ ప్రభాకర్ సూచించారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, నిర్మాణాలకు సంబంధించి, సకాలంలో మెటీరియల్, బిల్లులు చెల్లించడంతో పాటు రుణ సదుపాయం కూడా ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. పునాది తవ్విన వెంటనే రూ.25 వేలను మొదటి బిల్లుగా చెల్లించడం జరుగుతోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, లబ్ధిదారులు నిర్మాణాల్లో జోరు పెంచాలని కోరారు.

భారీ వర్షం

సీతంపేట: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఇన్నాళ్లు ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు వర్షంతో కాస్త ఉపశమనం పొందారు.

ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

తెర్లాం: మండలంలోని సతివాడ గ్రామ చెరువు గర్భాల్లోని ఆక్రమణలను మంగళవారం తొలగించారు. ఆక్రమణలపై అందిన ఫిర్యాదు మేరకు ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో వీఆర్‌ఓ అక్కడికి వెళ్లి, జేసీబీతో ఆక్రమణలు తొలగించారు. చెరువు గర్భాలను, గోర్జిలను, సామూహిక ఉపయోగ స్థలాలను ఆక్రమణ చేయడం నేరమని, చెరువు గర్భాలను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సకాలంలో నాడు-నేడు పనుల పూర్తి

తెర్లాం: మనబడి నాడు–నేడు పథకం పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈఓ జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను మంగళవారం పరిశీలించిన ఆయన పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేయాలని, పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే తప్పవని హెచ్చరించారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు



నవధాన్యాల కిట్లుతో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సీతంపేట: నవధాన్యాల సాగు చేసుకుంటే నేల సారవంతం కావడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రతినిధి కె.ప్రకాష్ అన్నారు. మండలంలోని దేవనాపురం గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు మంగళవారం నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేసుకుంటే నేల సారం పెరుగుతుందని, పంట మొక్కలకు కావాల్సిన పోషకాలు కూడా మెండుగా అందుతాయన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ఆసక్తి చూపాలన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ సుకన్య

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని లైబ్రేరియన్ డి.సుకన్య అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తకాలు చదివించి, విరామ చిహ్నాలు పాటిస్తూ అర్థం చేసుకునేలా పుస్తకాలు ఎలా చదవాలన్న అంశంపై వారికి అవగాహన కల్పించారు. ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి, ఇక్కడ లభించే వివిధ పుస్తకాలు చదివి, జ్ఞానం పెంపొందించుకోవాలన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు

- డీఎస్పీ శ్రీధర్



సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీధర్

రామభద్రపురం: ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ తిరుమలరావుతో కలిసి మండల కేంద్రంలోని జాతీయ, రాష్ట్ర రహదారుల పక్కనే ఉన్న దుకాణాదారులు, వాహనదారులతో మంగళవారం సమావేశమైన ఆయన గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా బొబ్బిలి వైపు వెళ్లే రహదారి చివరి వరకు రోడ్డు కొంతమేర ఆక్రమణకు గురికావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో ఆ ఆక్రమణల తొలగింపు చర్యలు చేపడతామన్నారు. ఆక్రమణల కారణంగానే రోడ్డు ఇరుకుగా తయారుకావడం, అంతర్ రాష్ట్ర కూడలి కూడా కావడంతో వాహనాల రద్దీ ఎక్కువై, తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. రోడ్డును ఆనుకుని దుకాణాలు ఉండడం కూడా ట్రాఫిక్ సమస్యకు కారణమన్నారు. రోడ్డుపై వాహనం నిలిపి, వస్తువు కొనుగోలుకు దుకాణానికి వెళ్తే వాహనదారుడు, దుకాణాదారుడిపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు. దుకాణాల వద్ద వాహనాలు నిలపకుండా వ్యాపారులే బాధ్యతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సురేంద్రనాయుడు, ఏఎస్‌ఐ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ లైఫ్'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో నిర్వహిస్తున్న మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మిషన్ లైఫ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం మిషన్ లైఫ్ కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయతీల్లో ఈ నెల 18 నుంచి జూన్ 5వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేస్తోందన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను తనిఖీ చేయడంతో పాటు ప్రతిరోజూ ప్రజల ఆరోగ్యానికి సంబంధించి, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీల్లో చేపట్టిన కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. జూన్ 1వ తేదీన ప్లాస్టిక్ నిషేధంపై 2వ తేదీన నీటిఆదాపై అవగాహనతో పాటు 3వ తేదీన గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమం, 5వ తేదీన చెరువులు, కోనేరులను శుభ్రం చేసి, గట్లపై మొక్కలు నాటాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ఈఓపీఆర్‌డీ ఆర్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలంటే చంద్రబాబుకు కడుపుమంట

- నిరసన ర్యాలీలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ శ్రేణులు

పాలకొండ: పేదలంటే చంద్రబాబుకు కడుపుమంట అని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ విమర్శించారు. అమరావతిలో నిరుపేదల ఇళ్ల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన సెంటు స్థలాన్ని సమాధి స్థలంతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పోల్చడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పెద్దఎత్తున పార్టీ శ్రేణులతో జరిగిన ఈ ర్యాలీలో టీడీపీ అండ్ కో తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చంద్రబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్త రాజధానిగా అమరావతిని చేసి, అక్కడ తమ వర్గానికే మేలు జరిగేలా ప్రభుత్వ భూమిని చంద్రబాబు పంచాలని చూశారని ఆరోపించారు. అన్ని వర్గాల బాగోగులే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, ఆ దిశగా ఆయన అనేక పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు రూపొందించి, అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అన్ని విధాలా ప్రభుత్వం మేలు చేస్తుంటే టీడీపీ పనిగట్టుకుని, విమర్శలు చేయడం తగదన్నారు. నలభై యేళ్ల రాజకీయ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు తన పాలనా కాలంలో పెత్తందార్లకు తప్ప పేదలకు ఏనాడైనా మేలు చేశారా అని ప్రశ్నించారు. ప్రతీ పేదవాడు తన సొంతింటిలో సంతోషంగా జీవించాలన్నదే సీఎం జగనన్న ధ్యేయమని, అందుకే పల్లెలు, పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేదలందరికీ ఇంటి స్థలాలు ఇస్తున్నారని, ఒకవేళ స్థలం చూపిస్తే ఇల్లు కట్టుకోవడానికి ఆర్థికసాయం అందిస్తున్నారని వివరించారు. పేదల అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న టీడీపీ, ఆ పార్టీ నేతలకు అధోగతి తప్పదన్నారు. రాష్ట్ర ప్రజలంతా సీఎం జగన్ వెంటే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయభేరి మోగించడం ఖాయమన్నారు.